క్లుప్తంగా

విద్యార్థులకు దంత శుభ్రతపై అవగాహన

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దంతాలు, నాలుక, చిగుళ్ల పరిశుభ్రత, పిప్పిపళ్ల నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు అభిజ్ఞ, శిల్ప, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణప్రియ

శ్రీకాళహస్తి: జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ సోమవారం ఆకస్మికంగా సబ్‌జైలును తనిఖీ చేశారు. జైలు పరిసరాలు, గదులు, మరుగుదొడ్లు, భోజనశాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే అర్జీ రూపంలో ఇస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేలంతో రూ.8,60,500 ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పంచాయతీకి వాణిజ్య సముదాయాలు, బస్టాండ్, కూరగాయల మార్కెట్ వేలం ద్వారా రూ.8,60,500 ఆదాయం చేకూరింది. పాపానాయుడుపేట సచివాలయంలో సోమవారం సర్పంచ్ లలిత ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తంబా సుబ్రమణ్యం, గోవిందస్వామి మొదలి, పంచాయతీ కార్యదర్శి లతాశ్రీ, వేలం దారులు పాల్గొన్నారు.

ఘనంగా సుమంగళి వ్రతం



భక్తులకు అన్నదానం చేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో దోబీఘాట్ వద్ద వెలసిన కరిమారియమ్మ ఆలయంలో సోమవారం ఘనంగా సుమంగళి వ్రతం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వ్రతం నిర్వహించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పసల కుమారస్వామి, బాలగౌడ్, తేజు, సునీల్, తేజ, మహిళా భక్తులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తీశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ధ్వజస్తంభం వద్ద జస్టిస్ అజిత్‌సింగ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజిత్‌సింగ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుకలను కాపాడుకుందాం



తిరుపతి అలిపిరి: శ్రీ వెంకటేశ్వర జూపార్కులో సోమవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్యూరేటర్ సెల్వం, తిరుపతి సైన్స్ సెంటర్ ఎడ్యుకేటర్ పురుషోత్తం పిచ్చుకల గూళ్లు, వాటి పరిరక్షణ, వాటర్ ఫీడర్ల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూపార్క్ ఎడ్యుకేటర్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రుణాలు వెలుగులోకి వచ్చేనా?

- గతేడాది నవంబర్ 16న కేసు నమోదు
- యథేచ్ఛగా తిరుగుతున్న నిందితులు
- ఇప్పటివరకు నిందితుల అరెస్టు లేదు
- రూ.2.50 కోట్ల ప్రభుత్వ నగదు రికవరీ ఊసే లేదు
- 4 నెలలు అవుతున్నా అక్రమార్కులపై చర్యలు శూన్యం



వరదయ్యపాళెంలో రుణ బాధితులతో మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరక్రాంతి పథకం(వెలుగు) సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శించి స్వాహా చేసిన రూ.2.50 కోట్లు రికవరీ అయ్యేనా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ అక్రమాలపై గతేడాది నవంబర్ 16న స్థానిక వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఏపీఎం ప్రధాన నిందితురాలు సీటీ జ్యోతి, సీసీ పుల్లయ్య, సంఘమిత్రాలు దేవి, యువరాజు, ఇంద్రజ, స్వీపర్ తులసమ్మ, వీఓ లీడర్ విజయమ్మపై కేసు నమోదైంది. అయితే ఈ కేసు నమోదై 4 నెలలు గడుస్తున్నా ఒక సంఘమిత్ర యువరాజును మాత్రమే అరెస్టు చూపారు. మిగిలిన నిందితులను ఇప్పటివరకు అరెస్టు చేయలేదు. కాజేసిన ప్రభుత్వ సొమ్ము రూ.2.50 కోట్ల నగదు రికవరీ కాలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు కూడా కేసును ఛేదించడంలో కొంత ఆలస్యం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ రుణాల బాగోతం బయట పడిన సమయంలో దాదాపు 10 రోజులకు పైగా కేసులో ఉన్న నిందితులంతా అటు పోలీస్ స్టేషన్, ఇటు వెలుగు కార్యాలయం చుట్టూ తిరిగారు. కానీ ఎందుకు అరెస్టు చేయలేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం నిందితులంతా బయట ప్రాంతాల్లో తల దాచుకుని అరెస్టు కాకనే బెయిల్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.

రూ.2.50 కోట్లు రికవరీ అయ్యేనా ?

వరదయ్యపాళెం ఇందిరక్రాంతి పథకం(వెలుగు)లో 30 నకిలీ గ్రూపుల పేరిట అక్రమంగా బ్యాంకుల్లో రుణాల పేరిట తీసుకున్న రూ.2.50 కోట్లు డబ్బు రికవరీపై అటు బ్యాంకు అధికారులు, ఇటు మోసపోయిన బాధితులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో ఈ అవినీతి బాగోతం జరిగింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మోసపోయిన బాధితులు ఒక్కసారిగా రోడ్డునపడ్డారు. జిల్లాస్థాయిలో ఇందిరక్రాంతి పథకం ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిందితులు రూ.2.50 కోట్లు అక్రమంగా రుణాలు పొందినట్లు నిర్ధారించారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుల నుంచి సొమ్ము రికవరీ కాకపోగా అరెస్టు కూడా కాలేదు. వరదయ్యపాళెంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు, డీసీసీ బ్యాంకుల నుంచే అక్రమంగా రుణాలు పొందారు. ఈ వ్యవహారంలో ఈ రెండు బ్యాంకులకు చెందిన మేనేజర్లు అప్పట్లో సస్పెండ్ అయ్యారు. రుణాల గడువు దాటి పోవడంతో నకిలీ గ్రూపుల పేరిట రుణాలు మంజూరు చేసిన బాధిత సభ్యులపై బ్యాంకర్ల నుంచి ఒత్తిడి మొదలైంది. అయితే రుణాలు పొందిన వారేమో యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. బాధితులు మాత్రం నిత్యం ఒత్తిడికి గురై ఇబ్బందుల పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రుణాలకు పాల్పడిన నిందితుల నుంచి సొమ్మును రికవరీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

త్వరలో నిందితులను అరెస్టు చేస్తాం..



అక్రమ రుణాలకు సంబంధించి వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తాం. వారు స్థానికంగా లేకున్నా బయట ప్రాంతాల్లో ఉన్నట్లు సమాచారం అందింది. ప్రత్యేక బృందాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటాం.

– శివకుమార్ రెడ్డి, సీఐ, సత్యవేడు

జల జీవన్ మిషన్ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని కందాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ప్రగతి జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మంచినీటి ప్రాముఖ్యత, మంచినీటి వనరుల నిర్వహణ, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రగతి జలజీవన్ మిషన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయుడు రెడ్డయ్య, పంచాయతీ కార్యదర్శి మాధవి, ప్రగతి సంస్థ ప్రతినిధులు సురేష్, సుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యవేడులో భూ సర్వేకు ఇబ్బందులు

సత్యవేడు: మండలంలో సర్వేయర్ల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ సర్వేయర్లు 15 మంది డిప్యుటేషన్‌పై వెళ్లడంతో సమస్య నెలకొంది. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐలు ఇద్దరు లేకపోవడంతో పనులు సకాలంలో జరగడం లేదు. అధికారులు సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అక్రమ గేటును తొలగించాలని ఫిర్యాదు



డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న చిందేపల్లి గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి వద్ద ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ యాజమాన్యం రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గేటును తొలగించాలని డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడుకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. తిరుపతిలోని ఆయన కార్యాలయంలో సోమవారం గ్రామస్తులు కలిసి సమస్యపై వినతి పత్రం అందించారు. చిందేపల్లి గ్రామం ఆవిర్భావం నుంచి గ్రామస్తులు వెళుతున్న రోడ్డుకు అడ్డంగా ఈ నెల 18న రోడ్డుకు అడ్డంగా గేటును ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామం నుంచి వెళ్లడానికి రోడ్డులేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి గేటును తొలగించి న్యాయం చేయాలని వారు కోరారు.

అసైన్‌మెంట్ భూముల పంపిణీకి సర్వే చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: అసైన్‌మెంట్ భూముల పంపిణీ కోసం అనాధీనం భూములను త్వరితగతిన సర్వే చేయాలని డిప్యూటీ తహసీల్దార్ శివయ్య తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీ, భూ రీసర్వేపై వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనాధీనం భూములను గుర్తించి, అర్హులైన వారికి అసైన్‌మెంట్ భూముల పట్టాలను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. ఇందుకోసం వీఆర్‌ఓలు, సర్వేయర్ల అనాధీనం భూములను సర్వే చేసి, రికార్డులను సిద్ధం చేయాలని తెలిపారు. త్వరలోనే భూ సర్వే కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు.

వేలంలో రూ.12.8 లక్షల ఆదాయం



వేలం పాట వివరాలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ

సత్యవేడు: పంచాయతీలోని దినసరి కూరగాయల మార్కెట్, దుకాణ గదులు, వారపు సంత, జంతువధశాల తదితర వాటికి సోమవారం సచివాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో సత్యవేడు పంచాయతీకి రూ. 12.88 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మునిరవి కుమార్ తెలిపారు. ఎంపీడీఓ బాలగణేష్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. బస్టాండ్, దినసరి కూరగాయల మార్కెట్ వద్ద గల నాలుగు గదులు, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఆరు గదులకు వేలం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గత ఏడాది కంటే రూ. 2.80 లక్షలు ఆదాయం పెరిగిందన్నారు. సర్పంచ్ మంజుల, వైఎస్సార్‌సీపీ నేత రమేష్ పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): నోటి క్యాన్సర్‌ను అరికట్టేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ తేజేశ్వరి వివరించారు. మండలంలోని ఆశా కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు సోమవారం ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ తేజేశ్వరి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తులకు, మద్యానికి దూరంగా ఉండాలని, క్రమం తప్పకుండా దంత వైద్యునిచే పరీక్షలు చేయించుకోవాలని, అధిక కారం, ఘాటైన పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. నోరు, నాలుక, గొంతు, దంత సమస్యలు లేకుండా చూసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ ప్రతి రోజు దంతాలను ఉదయాన్నే శుభ్రపరచుకోవడమే కాకుండా రాత్రి పడుకునే ముందు కూడా దంతాల శుభ్రత తప్పనిసరి అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

27న ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్, ఆర్డీఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల భూమిపూజకు ఈ నెల 27న ముహూర్తం నిర్ణయించినట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావుతో కలిసి సోమవారం ఆయన వరదరాజస్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. తొలగిస్తున్న రాళ్ల భద్రపరచడం, నిర్మాణ పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్డీఓ సూచించారు. అనంతరం అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ మొదట ఈనెల 23వ తేదీ భూమిపూజ చేయాలని నిర్ణయించినప్పటికీ వైష్ణవ ఆగమశాస్త్రం ప్రకారం టీటీడీ ఆగమ నిపుణులు, పంచాంగం పరిష్కారకర్త ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యుల సూచనల మేరకు 27వ తేదీకి వాయిదా వేసినట్టు తెలిపారు. పురపాలక సంఘ కమిషనర్ బాలాజీనాయక్, ఆలయ అధికారులు మురళీధర్, శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్‌కుమార్, లోకేష్‌బాబు, లక్ష్మయ్య, స్థపతి కుమార్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యేపై దాడి అమానుషం





బీఎన్‌కండ్రిగలో...నారాయణవనంలో.. నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం అన్నారు. దళిత ఎమ్మెల్యేపై దాడికి నిరసనగా సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో ఆ పార్టీ నాయకులు బ్లాక్‌డే ప్లకార్డులతో నిరసన తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు పద్ధతి మార్చుకోకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌పాల్, ఆనంద్, గురవయ్య, రవి, మునిచంద్రానాయుడు, బాలశేఖర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలంటే పచ్చపార్టీకి విలువలేదు

నారాయణవనం: గౌరవప్రదమైన చట్టసభలో దళిత మంత్రిని, ఎమ్మెల్యేని దూషించి దాడి చేసిన టీడీపీ ఎమ్మెల్యేలకు చట్టసభలంటే విలువ లేదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు విమర్శించారు. ఈ ఘటనకు నిరసనగా నారాయణవనం బైపాస్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినితి పత్రాన్ని సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలంటే టీడీపీ అధినేత చంద్రబాబుకు గిట్టదన్నారు. ఆయన సూచనలతోనే టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. పోడియం వద్ద స్పీకర్‌కు రక్షణగా నిలిచిన ఎమ్మెల్యేపై దాడికి పాల్పడడం వారి పరాకాష్టకు నిదర్శనమని చెప్పారు. దాడి చేయాలన్న లక్ష్యంతోనే ప్రతిపక్షం జీఓ నెంబర్ 1పై రాద్ధాంతం చేసిందన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, సర్పంచ్‌లు మురుగేశం, గుణశేఖర్, ధర్మలింగం, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవి, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప తదితరులు ఉన్నారు.


అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్యవేడు: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నేత రమేష్ కోరారు. సోమవారం సత్యవేడు అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి సీఐటీయూ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అరుణాచలం, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, ఝాన్సీ, కాంతమ్మ, ఇంద్ర పాల్గొన్నారు.

అకాల వర్షం.. పంటల నష్టం



ఏర్పేడు: వర్షానికి నేలకొరిగిన వరిపంట



తొట్టంబేడు: వేరుశనగ పంటలో నిలిచిన నీరు

ఏర్పేడు: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు రైతులు సాగు చేసిన వరి పంట నేలకొరిగింది. 15 నుంచి 20 రోజుల్లో వరి పంట ఒబ్బిడి చేయాల్సి ఉండగా వడగండ్ల వానతో వరిధాన్యం నేల రాలింది. ఆరుగాలం శ్రమించి వేసిన పంట నేలకొరగడంతో దిగుబడి తగ్గి పెట్టుబడి రాకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు సుమారు రూ.40 వేలు ఖర్చు చేసి సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయానికి నేలపాలయింది.

వేరుశనగ పంటకు నష్టం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలో కురిసిన అకాల వర్షంతో చియ్యవరం, బసవయ్యపాళెం పంచాయితీలో వేరుశనగ, వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. చియ్యవరంలో 100 ఎకరాలు, బసవయ్యపాళెంలో 12 ఎకరాలలో వేరుశనగ పంట పది రోజుల క్రితం వేశారు. ఈ వర్షాలతో పొలాల్లో నీరు చేరడంతో వేరుశనగ మొలకెత్తకపోవడంతో రైతులు నష్టపోయారు. చేమూరులో వరి పంట వర్షానికి తడిసి మొలకెత్తడంతో 50 ఎకరాల్లో పంటకు నష్టం కలిగింది. ఈ ఏడాది పంట చేతికి వచ్చే సమయంలో వడగండ్లు, గాలులు, మెరుపులు, వర్షంతో రైతులకు నష్టం మిగిల్చింది. వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె మండల ఇన్‌చార్జి పవిత్రారెడ్డి పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.



మొలకెత్తిన వరి ధాన్యం

కన్నీళ్లు మిగిల్చిన వాన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి, మిరప, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. చేతికందిన పంట నీటిపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా పల్లమాల, కరకంబట్టు, కాటూరు, ఆలత్తూరు, పుత్తేరి గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. కోత దశకు చేరుకున్న వరిపంట అకాల వర్షంతో నేలకొరిగింది. కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయి మొలకలు వస్తున్నాయి. అదే విధంగా 140 ఎకరాల్లోని మిరప పంట, 150 ఎకరాల్లో మామిడి పూత దెబ్బతింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



బీఎన్‌కండ్రిగలో నీట మునిగిన వరి



తడిచిన ధాన్యం బస్తాలు